క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు



డిచ్‌పల్లి(ఇందల్వాయి): ఇందల్వాయి మండలం మల్లాపూర్‌లోని ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్సీ వి. గంగాధర్ గౌడ్ రూ.4 లక్షల నిధులు మంజూరు చేశారు.ఈ మేరకు గురువారం గ్రామ సర్పంచ్ సత్యనారాయణ,ఉప సర్పంచ్ రఘునందన్‌లకు నిధుల మంజూరుకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు.అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీకి ముదిరాజ్ సంఘంసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): విద్యార్థులు సామాజిక సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు, గురువులను దైవ సమానంగా భావించాలని స్వచ్ఛంద సేవకులు బురుగోజు రామకృష్ణాచారి పేర్కొన్నారు. గురువారం నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో 7, 8, 9వ తరగతి విద్యార్థులకు ఆయన పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు, పెన్నులను పంపిణీ చేశారు. రామకృష్ణాచారి మాట్లాడుతూ..చదువు విలువ తెలిసిన వాడిగా పేద విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తన వంతుగా సాయం చేస్తున్నానని తెలిపారు. హెచ్‌ఎం శ్రీకాంత్, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లెపూల నవీన్, రామ్మోహనచారి, రామకృష్ణ కుటుంబీకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): హుస్నాబాద్ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపడుతున్న హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో పాల్గొని ఆయనను జిల్లా నాయకులు కలిశారు. ఈసందర్భంగా ఆయనతో పలు అంశాలపై చర్చించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శులు కాటిపల్లి నగేష్ రెడ్డి, గడుగు గంగాధర్, ముప్ప గంగారెడ్డి, జావేద్ అక్రమ్, తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏ సమస్యలు పరిష్కరించాలని వినతి

సుభాష్‌నగర్: గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 80 రోజుల సమ్మె కాలపు జీతాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంస్థలను నిర్వీర్యం చేయటం మానుకోవాలి

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడాన్ని కేంద్రం మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ డివిజనల్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా కార్మికులు చేస్తున్న ఒక రోజు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఓమయ్య మాట్లాడుతూ..జీడీఎస్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసులకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అశాస్త్రీయమైన ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు డీజీ ఆఫీస్‌లో నిర్ణయించడం ఆపివేయాలన్నారు.

బీజేపీ గెలుపుపై సంబురాలు



ఖలీల్‌వాడి: మూడు రాష్ట్రాల ఎన్నికల్లో గురువారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అఖండ విజయం సాధించడంపై న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. న్యాయవాద పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశ పౌరులు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలపడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికై బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోను అక్కడి ప్రజలు స్వీకరించి అఖండ విజయాన్ని అందించారని తెలిపారు.

పార్కింగ్ లేక ఇబ్బందులు

- ఖలీల్‌వాడిలో వన్‌వే పెట్టినా తగ్గని ట్రాఫిక్
- ద్వారకానగర్ చౌరస్తా వద్ద తగ్గని ట్రాఫిక్ ఇక్కట్లు
- ఆస్పత్రుల్లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడమే ప్రధాన కారణం



ద్వారకానగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతం ఆస్పత్రులకు ప్రసిద్ధి. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం ప్రజలు వస్తారు. ఈ ప్రాంతంలోని ద్వారకానగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొన్ని నిమిషాల పాటు వాహనాలు రాకపోకలకు ప్రతి రోజూ అంతరాయం కలుగుతోంది. అయినా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రించడం లేదని వాహనదారులు అంటున్నారు. ద్వారాకనగర్ చౌరస్తా నుంచి వీక్లీ మార్కెట్, ఈ చౌరస్తా నుంచి బస్టాండ్‌కు, కపిల హోటల్‌కూ, తిరుమల టాకీస్ వైపు, అలాగే కోర్టు చౌరస్తా వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో వాహనాలు ఎక్కువగా ఈ మార్గం నుంచే వెళతాయి. అయితే కొన్ని నెలల క్రితం ఖలీల్‌వాడిలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడానికి వన్‌వే ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు చోట్ల ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ కొన్ని సందర్భాలలో ఒకే కానిస్టేబుల్ లేదా ఇద్దరు కానిస్టేబుళ్లు మాత్రమే ఉంటున్నారు. అంతేకాకుండా లయన్స్‌క్లబ్ వద్ద బారికేడ్లను ఏర్పాట్లు చేసి వాహనాలను నిలిపి వేస్తున్నారు. దీంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లపైనే వాహనాలు..

చాలా ఆస్పత్రుల వద్ద పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. పార్కింగ్ కోసం ఎలాంటి స్థలం లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పార్కింగ్ స్థలం లేకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆస్పత్రులకు పర్మిషన్లు ఎలా ఇచ్చారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.పార్కింగ్ స్థలాలు లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రుల అనుమతులు రద్దు చేయాలి



పార్కింగ్ లేని ఆస్పత్రుల అనుమతులు రద్దు చేయాలి. ఆస్పత్రి నిర్మాణానికి తప్పని సరిగా పార్కింగ్ ఉంటే అనుమతులు ఇవ్వాలి. పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలి. అప్పటి దాకా ద్వారకానగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి.

– శంకర్, స్థానికుడు, నిజామాబాద్

అటెన్షన్ ప్లీజ్.. బస్టాండ్ ఆవరణలో మురికినీరు



నిజామాబాద్ బస్టాండ్ ఆవరణలో మురికినీరు ప్రధాన ద్వారం వద్ద నిలువడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురికినీటి నుంచే నడవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికినీరు నిలువ ఉండకుండ చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: ఉషాదేవి,ఆర్టీసీ రీజినల్ మేనేజర్

ఫోన్ నంబర్ : 9959226011

‘ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి’



మాట్లాడుతున్న రమేష్‌బాబు

ఖలీల్‌వాడి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎంత వరకైనా పోరాడతామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు అన్నారు. గురువారం మూడవ రోజుల సమ్మెలో భాగంగా నిజామాబాద్ పాత కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అంగన్‌వాడీ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి రమేష్ బాబు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు మాట్లాడారు.. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ హెల్త్ కార్డులు, పెన్షన్స్ సౌకర్యం, పండగ బోనస్‌లను ఇస్తున్నారని గుర్తు చేశారు. ధర్నా అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, తదతరులు తరలివచ్చారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



సిలిండర్లతో ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌టీపీ నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

సాక్షి నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ గురువారం అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. కట్టెల పొయ్యిపై వంట చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తుందంటూ నాయకులు విమర్శించారు.

సబ్ కా వికాస్ కాదు.. సబ్ కా పరేషానీ



డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

- బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలి
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై ధరల భారం వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అన్ని రకాలుగా అండగా నిలుస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతుందని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మండిపడ్డారు. సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ పేరుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పుడు సబ్ కా పరేషానీ ప్రభుత్వంగా నిలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రూరల్ నియోజకవర్గ స్థాయిలో బీఆర్‌ఎస్ నిర్వహించిన మహాధర్నాలో ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఒకవైపు పెట్రోధరలు మండిపోతుంటే ఇప్పుడు గ్యాస్ ధరలను పెంచి కేంద్రం ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

పేదల నెత్తిన పిడుగుపడింది: వీజీ గౌడ్

గ్యాస్‌సిలిండర్ ధర పెంపు వల్ల పేదల నెత్తిన పిడుగు పడినట్లయిందని ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. రాబోయే రోజుల్లో పేదలకు కట్టెల పొయ్యే దిక్కన్నారు. ప్రజలను అన్ని విధాల ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దక్కన్ ప్రజలు ఒకే వేదికపైకి రావాలి



పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎంఐఎం నేతలు

ఖలీల్‌వాడి: దక్కన్ ప్రాంత ప్రజలు ఒకే వేదికపైకి రావాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్ అహ్మద్ ఫాజిల్ అన్నారు. గురువారం ఆలిండియా ఎంఐఎం 65వ పునరుజ్జీవ వేడుకల సందర్భంగా నగరంలోని నెహ్రూపార్క్, జిల్లా ఎంఐఎం పార్టీ కార్యాలయంలో జిల్లా సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ అహ్మద్ ఫాజిల్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కార్పొరేటర్లు, కార్యకర్తలు, నేతలు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 65 ఏళ్ల క్రితం అబ్దుల్ వాహిద్ ఓవైసీ, ఎంఐఎం పగ్గాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీలు ముస్లింలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం గళం విప్పుతున్నారని అన్నారు. పార్టీలోకి యువత చేరడానికి ముందుకురావాలని 31వ డివిజన్ ఇన్‌ఛార్జి మున్వర్ అలీ కోరారు. పలు చోట్ల పార్టీ జెండాలను నాయకులు ఎగురవేశారు.

పట్టాభూమిలో మృతదేహాలు పాతిపెట్టొద్దు



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న బాధితుడు యశ్వంత్

సుభాష్‌నగర్: నగరంలోని తారకనగర్‌లోగల తన పట్టా భూమిలో మృతదేహాలు పాతి పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు యశ్వంత్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ.. 1965లో వ్యవసాయ భూమిని తన తండ్రి కొనుగోలు చేశారని, కొన్నేళ్లుగా మా సొంత భూమిలో మృతదేహాలను పాతి పెడుతున్నారని పేర్కొన్నారు. ఇదేవిషయమై రూరల్ ఎస్సై, ఆర్ ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, కాలనీవాసులందరితో ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారన్నారు. ఈ నెల 13న కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చానని, సానుకూలంగా స్పందించి విచారణ చేపట్టిన తర్వాతే న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. దరఖాస్తు తేదీని ప్రభుత్వం ఈనెల 8 వరకు పొడిగించిందని తెలిపారు. ఆరవ నుంచి పదవ తరగతి వరకు మిగిలిన సీట్లకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉంటుందని తెలిపారు.

స్విమ్మింగ్‌లో మహిళలకు ప్రత్యేక బ్యాచ్

నిజామాబాద్‌నాగారం: సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్‌లో ఈ నెల 3 నుంచి మహిళలకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న గురువారం తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు స్విమ్మింగ్ కోచ్ మహిపాల్ రెడ్డిను 9866970010 ద్వారా సంప్రదించాలన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి



నిజామాబాద్‌నాగారం: ఉగాదికి ముదిరాజ్ జెండాల ఆవిష్కరణలు ఓ యజ్ఞంలా చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొప్పరి శంకర్ ముదిరాజ్ సూచించారు. గురువారం జిల్లా అధ్యక్షుడు యాసాడ నర్సింగ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పార్టీలు ఏవైనా ముదిరాజులు ఐక్యంగా ఉండాలని, మన హక్కుల సాధన కోసం పాటుపడాలన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

సుభాష్‌నగర్: కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారకులైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని పులాంగ్ చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గిరిజన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు.

చెరువుకు మరమ్మతులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): చిన్నాపూర్‌లోని హనుమకుంట చెరువుకు మరమ్మతులు చేపడుతున్నారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువుకు గండి పడి నీరంతా కిందిభాగంలోకి వెళ్లిపోయాయి. తద్వారా చెరువు పూర్తిగా ఖాళీఅయ్యింది. చెరువుకు గండి పడటంతో ఇరిగేషన్‌శాఖ అధికారులు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించారు. రూ.19 లక్షలు మంజూరు కావడంతో మరమ్మతు పనులు ప్రారంభించారు. గురువారం పనులను ఇరిగేషన్‌శాఖ ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని, 15 రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం



పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ: నగరంలోని గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రంలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి మూడో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఆలయంలో శ్రీనివాస కల్యాణం, రథోత్సవం కనుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఆలయ అర్చకులు, ట్రస్ట్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం తిరుపతి నుంచి విచ్చేసిన బ్రహ్మ శ్రీ వేదాంతం నారాయణ భట్టాచార్యులు వారి బృందం మంత్రోచ్ఛారణలతో స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ రెడ్డి, ఆలయ ట్రస్టీ సంపత్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జి జలంధర్, స్థానిక కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయాలి



మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, నాయకులు

సుభాష్‌నగర్: నగరంలో అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. గురువారం పార్టీ నగర కార్యాలయంలో పేదోడి గూడు కోసం మహాధర్నా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. 9 ఏళ్లుగా నగరంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఎన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. కట్టిన ఇళ్లు సైతం శిథిలావస్థకు చేరుతున్నాయని ఆరోపించారు. అర్హులైన పేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయలేని స్థితిలో అర్బన్ ఎమ్మెల్యే ఉన్నారని ఎద్దేవా చేశారు. మహాధర్నా కార్యక్రమానికి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, బీఆర్ శివప్రసాద్, వినోద్‌రెడ్డి, రోషన్, మీ–సేవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శ్రీ చైతన్య స్కూల్ ఎదుట గురువారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం స్కూల్‌ను బంద్ చేయించారు. హైదరాబాదులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సాత్విక్ అనే విద్యార్థి ఒత్తిడితో ఆత్మహత్య చేసుకొని చనిపోవడాన్ని నిరసిస్తూ ఈ బంద్ చేపట్టారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణు రాజ్ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం, సిబ్బంది వేధింపులకు భరించలేక సాత్విక్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమైన ఘటన అని అన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	56,850	వెండి (కిలో)	68,000
22 క్యారెట్స్	52,400	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	20	క్యాప్సికం	20	40
బెండకాయ	50	70	గాజరుగడ్డ	20	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	25	40
దొండకాయ	25	40	దోసకాయ	10	20
బీర్నిసుకాయ	35	50	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	12	25	గోబిపువ్వు	15	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	15	30	చిక్కుడుకాయ	30	50
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– బలగం,1.30,7.30
సార్– 4.30,10.20
స్క్రీన్–2– గ్రంథాలయం– 4.30
వినరో భాగ్యము విష్ణుకథ– 7.20
ఇన్ కార్(తెలుగు)– 10.10
స్క్రీన్–3– ఆర్గానిక్ మామ –హైబ్రిడ్ అల్లుడు – ,10.32,4.20,7.40,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– యాంట్–మెన్ అండ్ ది వాస్ప్ (ఇంగ్లిష్)1.40,7.20
బలగం–4.30,10.10
స్క్రీన్–2 – సార్–12.50,7.00
–ఆర్గానిక్ మామ –హైబ్రిడ్ అల్లుడు,3.50, 10.00
స్క్రీన్–3– గ్రంథాలయం–2.00
–ఇన్ కార్(తెలుగు)5.05
–వినరో భాగ్యము విష్ణు కథ,7.30,10.30
స్క్రీన్–4– పఠాన్(హిందీ)–12.00,6.25,9.40
– సెల్ఫీ(హిందీ),3.15

దేవి – సార్
నటరాజ్ – ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు
లలితామహల్ – వాల్తేరు వీరయ్య
శ్రీదేవి – మిస్టర్ కింగ్స్
విజయ్ – బలగం